## జీహెచ్ఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేయడానికి వచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లకు పథకాల అమలు తీరును జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ వివరించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం హాల్‌లో సమావేశం నిర్వహించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న వివిధ పథకాలతో పాటు సంబంధించిన డెమోగ్రఫీ, శానిటేషన్, చెత్త సేకరణ, డిస్పోజల్, సిఅండ్ డి అడ్మినిస్ట్రేషన్, ప్రాపర్టీ ట్యాక్స్ తదితర పథకాలను తెలిపారు. ఈ సమావేశంలో ఈఎన్‌సీ జియా ఉద్దీన్, సీఈ దేవానంద్, కిషన్, అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, గీత రాధిక, సునంద, ట్రైనీ ఐఏఎస్‌లు ఉమాశంకర్, అమిత్, కిరణ్మయి, శారద శుక్ల, యువరాజ్, మాయక్, వికాస్ పాల్గొన్నారు.

## 8 నుంచి మొక్కజొన్న పరిశోధనా సంస్థల సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, మే 7 : తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే అవకాశం ఉన్న మొక్కజొన్నకు దేశ వ్యాప్తంగా అధిక ప్రాధాన్యత ఉంటుందని వర్సిటీ పరిశోధనా సంస్థ సంచాలకులు రఘురామిరెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఈ నెల 8వ తేదీన మొక్కజొన్న పరిశోధనా సంస్థల సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో భారత వ్యవసాయ పరిశోధనా మండలి అధికారులు 180 మంది, అఖిల భారత మొక్కజొన్న శాస్త్రవేత్తలు 120 మంది, ప్రైవేటు సంస్థల అధిపతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్న తాధికారులు పాల్గొననున్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం

సైదాబాద్, మే 7 : కంచన్‌బాగ్‌లోని మిధాని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ రెండవ వార్షికోత్సవం, పొడిగించిన సౌకర్యాల విస్తరణ భవన సముదాయాన్ని మంగళవారం మిశ్రాధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా 2022లో ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించామని, ఇప్పటి వరకు 20వేల మందికి వైద్య సేవలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మిధాని ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.గౌరీ శంకర్, ప్రొడక్షన్, మార్కెటింగ్ డైరెక్టర్ ముత్తు కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఉపేందర్ వెన్నం, తదితరులు పాల్గొన్నారు.

# పజ్జన్నకు బ్రహ్మరథం

**బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో జోరుగా పద్మారావుగౌడ్ ప్రచారం**

అడుగడుగునా మంగళ హారతులతో బ్రహ్మరథం పట్టిన మహిళలు

### కిషన్ రెడ్డి.. ఎంపీగా గెలిపించి.. కేంద్ర మంత్రిని చేస్తే.. ఏం చేశావ్ ?

- నిధులు తేలేవు.. ఉన్న నిధులు ఖర్చు పెట్టలే
- జైశ్రీరామ్, మోదీ పేరు ఎందుకు.. చేసిన అభివృద్ధి చెప్పు
- అభివృద్ధిని విస్మరించిన కిషన్ రెడ్డికి మళ్లీ ఎలా ఓటువేస్తారు..
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి
- భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

- సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బన్సీలాల్‌పేట్, మే 7 : కేంద్ర మంత్రిగా ఉండి నిధులు తేకుండా, ఉన్న నిధులు ఖర్చు చేయకుండా అభివృద్ధిని విస్మరించిన వ్యక్తికి ఓట్లు అడిగే అర్హత లేదని సికింద్రాబాద్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ అన్నారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా గెలిచి.. కాంగ్రెస్ పార్టీనుంచి ఎంపీగా పోటీ చేస్తున్న వ్యక్తిని ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో బీఆర్ఎస్ గెలిచిందని, ఆ లెక్కన భారీ మెజారిటీతో తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరుతూ మంగళవారం బన్సీలాల్ పేట్ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా బోలక్‌పూర్‌లోని శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అక్కడి నుండి కృష్ణానగర్ కాలనీ, బోలక్‌పూర్, ఆంజనేయస్వామి కాలనీ, ఐడీహెచ్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ, గొల్లకొమరయ్య కాలనీ వరకు ర్యాలీ కొనసాగింది. అడుగడుగునా వారికి అన్ని బస్తీలలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఐడీహెచ్ కాలనీలో బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అభ్యర్థి పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఇక్కడ గెలిచి ఎంపీగా, కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కాకుండా జైశ్రీరామ్, మోదీ పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని, ఎంపీగా కేంద్రం నుంచి నిధులు తేలేదని, ఉన్న నిధులను కూడా ఖర్చు చేయలేకపోయారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజలు మళ్లీ ఎలా ఓటువేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉన్న దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి గెలిచి ఇప్పుడు పార్టీ మారాడని, అలాంటి వారిని ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. ఈ నెల 13న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించి, సికింద్రాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజల విశ్వాసం కోల్పోయారని అన్నారు. ఈ పాదయాత్రలో సనత్‌నగర్ ఎన్నికల ఇన్‌చార్జి బి.వెంకట్‌రెడ్డి, బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్ గౌడ్, నాయకులు ఏసూరి మహేశ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కార్యదర్శి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరికి ఎంపీగా ఏం చేశావ్.?

- నియోజకవర్గాన్ని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చొద్దు
- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు.. నియోజకవర్గంతో సంబంధం ఉన్నదా..?
- స్థానికుడైనా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడిని గెలిపిస్తేనే.. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటడు
- వేలాది కోట్లతో ఎల్బీనగర్ కష్టాలు తీర్చిన బీఆర్ఎస్‌కే ఓటు వేయాలి
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఒక్క అవకాశం ఇచ్చి పార్లమెంటుకు పంపితే.. మల్కాజిగిరి రూపురేఖలు మారుస్తా
- బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మన్సూరాబాద్, మే 7 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయ పునర్జన్మనిచ్చిన మల్కాజిగిరికి ఏమి చేశాడో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు తెలియజేయాలని.. ఎంపీగా గెలిచిన అనంతరం ఏనాడు మల్కాజిగిరి ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మన్సూరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అపార్ట్‌మెంట్ల వాసులతో కలిసి నిర్వహించిన సమావేశానికి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరూ నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు.. ఎక్కడో నివసించే వారిని గెలిపిస్తే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకుంటారంటూ ప్రశ్నించారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధి ఉప్పల్‌కు చెందిన రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉంటాడని తెలిపారు. ఎవరు గెలిస్తే అందుబాటులో ఉంటారో ప్రజలు ఒక్కసారి గమనించి ఓటు వేయాలని సూచించారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గాన్ని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేలాది కోట్లతో అండర్‌పాస్ రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి విజ్ఞుడైన రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ మల్కాజిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాడని తెలిపారు.



మన్సూరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

### ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్: రాగిడి లక్ష్మారెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీలను అమలు చేశామంటూ సిగ్గు లేకుండా కాంగ్రెస్ నాయకులు అబద్దాలు అడుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బాసటగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలిపిన ఘనత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు దక్కుతుందన్నారు. ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించి పార్లమెంటుకు పంపితే మల్కాజిగిరి పార్లమెంటు రూపురేఖలు మారుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు దుర్గెంపూడి సాంబిరెడ్డి, జక్కిడి రఘువీర్‌రెడ్డి, కరణం శ్రీకాంత్, రుద్ర యాదగిరి, అత్తాపురం రాంచంద్రారెడ్డి, పారంద నర్సింగ్‌రావు, సిద్దగోని నర్సింహాగౌడ్, ఏలుకొండ రాంకోటి, సిద్దగోని జగదీశ్ గౌడ్, చెంగల్ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది

**అందుకే అబద్దాల సీఎం.. రెండోసారి ప్రచారానికి**

కంటోన్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి తప్పదు

అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత గెలుపు ఖాయం

విలేకరుల సమావేశంలో రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

కంటోన్మెంట్, మే 7 : ముఖ్యమంత్రి స్థానంలో ఉండి రేవంత్ రెడ్డి అబద్దాలు చెబుతున్నారని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి మండిపడ్డారు. మల్కాజిగిరి ఎంపీగా స్థానిక ప్రజలకు ఆయన చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. హామీలు అమలు చేశామని అబద్దాలు చెబుతుంటే.. ఆయన ప్రసంగానికి ప్రజల నుంచి స్పందన కరువైందని చురకలంటించారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి మాట్లాడారు. పార్టీలు మారి వచ్చిన వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇస్తే 30 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్న సాయన్న కుమార్తెకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడం తప్పా అని ప్రశ్నించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కంటోన్మెంట్ ఎమ్మెల్యే స్థానంలో నివేదిత గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ లోనూ గులాబీజెండా ఎగురవేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని.. అందుకే సీఎం రేవంత్ రెడ్డి రెండోసారి ప్రచారానికి వచ్చారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. కంటోన్మెంట్ లోని ప్రతి ఇంటికీ దివంగత ఎమ్మెల్యే సాయన్న ఏదో ఒక రూపంలో సహాయం అందించారని తెలిపారు. కంటోన్మెంట్ విలీనం కోసం 1997లోనే సాయన్న ప్రతిపాదన పెట్టారని గుర్తుచేశారు. కంటోన్మెంట్‌తో పాటు మల్కాజిగిరి ఎంపీ స్థానంలో గులాబీ జెండా విజయం ఖాయమని అన్నారు. ప్రచారంలో అన్నివర్గాల ప్రజల నుంచి అద్భుత స్పందన లభిస్తున్నదని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్న తెలిపారు. సమావేశంలో బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోక్ నాథ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరి, సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, ఆకుల హరి, పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళానేతలు, ఉద్యమకారులు, సాయన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో వర్షం కారణంగా కుప్పకూలిన ప్రహరీ

# బాచుపల్లిలో విషాదం

- అకాల వర్షంతో.. కుప్పకూలిన ప్రహరీ
- మట్టి పెల్లల్లో కూరుకుపోయిన కూలీలు
- ఒక మృతదేహం లభ్యం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- ఈ పాపం హెచ్ఎండీఏదే అంటున్న కార్మికులు

దుండిగల్, మే 7 (నమస్తే తెలంగాణ) : అకాల వర్షంతో నిర్మాణంలో ఉన్న సంస్థ ప్రహరీ గోడ కూలి పక్కనే నివాసముంటున్న కార్మికుల ఇండ్లపై పడిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు మట్టిలో కూరుకుపోయారు. ఏడు మంది గాయాలతో బయటపడ్డారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వర్షం ఏకదాటిగా కురిసింది. ఏడు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడ కూలిపోయింది. చిమ్మచీకట్లో సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి అక్కడ నెలకొంది. సంఘటనకు సంబంధించిన వివరాలు స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... బాచుపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రేణుకా ఎల్లమ్మ కాలనీలో రైజ్ డెవెలపర్స్ సంస్థ సుమారు 2 ఎకరాలలో అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. ఇందుకు హెచ్ఎండీఏ నుంచి అనుమతులు పొందారు. అనుమతులున్నా నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ స్థానికులు హెచ్ఎండీఏకు, స్థానిక పోలీసులకు ఫిర్యాదులు చేశారు. అయితే అధికారులంతా ఎన్నికల హడావిడిలో ఉండడంతో ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలని వేగంగా ప్రహరీ నిర్మిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇక్కడ పనిచేసేందుకు చత్తీస్‌ఘడ్, ఒడిశా, ఏపీ నుంచి సుమారు 200 మంది వరకు కార్మికులను రప్పించారు. వారందరికీ ప్రహరీగోడకు లోపలి వైపు రేకుల షెడ్లు వేసి ఆశ్రయం కల్పించారు.

**కుప్పకూలిన ప్రహరీ..**

మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. వర్షానికి కార్మికులంతా తమకు కేటాయించిన రేకుల షెడ్ల లోకి వెళ్లిపోయారు. రాత్రి 7గంటల ప్రాంతంలో ప్రహరీ ఒక్కసారిగా కూలి రేకుల షెడ్లపై పడిపోయింది. షెడ్డులో చిన్న పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. గాయాలతో ఉన్న వారిని సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ ప్రాంతమంతా చీకటిగా మారింది. దీంతో సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. మట్టిపెల్లల కింద సుమారు నలుగురైదుగురు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలుపుతున్నారు. రేకుల షెడ్లపై కూలిన మట్టిని తొలగిస్తేనే ఎంత మంది అందులో కూరుకుపోయారనే విషయం స్పష్టమవుతుందని పోలీసులు చెబుతున్నారు. కడపటి సమాచారం అందే వరకు ఒక మృతదేహం లభ్యమైంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు

### ఈ పాపం హెచ్ఎండీఏదే : జగదీశ్, స్థానికుడు

రైజ్ బిల్డర్ సంస్థ యజమాని అరవింద రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా స్థానికుల స్థలాలను కూడా ఆక్రమించి తనకున్న రాజకీయ పలుకుబడితో నిర్మాణాలు చేస్తున్నాడు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ హెచ్ఎండీఏకు ఫిర్యాదు చేశాం. అయితే ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. హడావిడిగా ప్రహరీ నిర్మించడంతోనే ఈ ప్రమాదం జరిగింది. హెచ్ఎండీఏ అధికారులు చర్యలు తీసుకొని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఈ పాపం హెచ్ఎండీఏదే.

సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

# ఆ పండ్లు తింటే.. క్యాన్సర్ తప్పదు

**విషతుల్యంగా.. అరటి, మామిడి, ద్రాక్ష**

బాటసింగారం పండ్ల మార్కెట్‌లో గుర్తింపు

నిషేధిత రసాయనాలతో మగ్గపెడుతున్న వ్యాపారులు

వివరాలు వెల్లడించిన కన్జూమర్ రైట్స్ ఆర్గనైజేషన్

ఖైరతాబాద్, మే 7 : రసాయనాలతో పండ్లను మగ్గిస్తూ ప్రజలను క్యాన్సర్ బారిన పడవేస్తున్నారని కన్జూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పండ్ల మార్కెట్లు, తోపుడు బండ్లలో అమ్ముతున్న అరటి, మామిడి, ద్రాక్ష పండ్లు విషతుల్యంగా ఉంటున్నాయని, వ్యాపారులు తమ స్వలాభం కోసం వాటిని ప్రజలకు విక్రయిస్తున్నారని తెలిపారు. తమ బృందం హైదరాబాద్‌లోని బాటసింగారం తదితర పండ్ల మార్కెట్‌కు వెళ్లి పరిశీలించిందని, అక్కడ ఉన్న ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లు అందరూ కలిసి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలు పాటించకుండా నిషేధిత రసాయనాలను వినియోగిస్తూ కృత్రిమ పద్ధతిలో పండ్లను మగ్గపెడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి పండ్లు తింటే పెద్దలలో గొంతులో మంట, కడుపు నొప్పి, అల్సర్, మెదడు వాపు, చర్మ సంబంధించిన వ్యాధులతో పాటు ప్రాణాంతక క్యాన్సర్ వస్తుందన్నారు. వ్యాపారుల ఆగడాలను అడ్డుకునేందుకు తమ బృందం మార్కెట్ కమిటీ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళితే తమపై వ్యాపారులు దాడి చేశారన్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో వేలాది మంది క్యాన్సర్ బారిన పడుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కన్జూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.శివకుమార్, రవియాదవ్, కార్యదర్శులు రామేశ్వరం రాజేశ్, దుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శి ప్రభాకర్, ప్రజా సంబంధాల అధికారి క్రిష్టఫర్, న్యాయ సలహాదారులు సౌమిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల తర్వాత రాజ్యాంగం ఉంటుందా.?

బీజేపీ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి

జర్నలిస్టుల అధ్యయన వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి

ఖైరతాబాద్, మే 7 : 'రాజ్యాంగాన్ని రక్షించుకోకుంటే మన మనుగడే అసాధ్యం.. బీజేపీ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి' అని వక్తలు అభిప్రాయపడ్డారు. జర్నలిస్టు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం సాయంత్రం 'భారత రాజ్యాంగం-హక్కులు-రిజర్వేషన్లు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం వేదిక ప్రధాన కార్యదర్శి సాధిక్ అధ్యక్షతన జరిగింది. సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలన విభజించి పాలించు అన్న చందంగా ఉందన్నారు. మిగతా దేశాల రాజ్యాంగంతో పోల్చుకుంటే ఇక్కడ రాజ్యాంగం ఎంతో గొప్పదన్నారు. గతంలో రాజ్యాంగానికి సవరణలు చేశారు తప్ప మార్చలేదన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని బీజేపీ అనుబంధ సంఘ్ పరివార్ సంస్థలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయని, ఈ ఎన్నికల తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉంటుందా లేదా అనేది చెప్పాలన్నారు. 2024 తర్వాత రాజ్యాంగాన్ని రక్షించేందుకు ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చుతారని కాంగ్రెస్, మార్చమని బీజేపీ అంటున్నాయని, ఇందులో ఏది కరెక్ట్ తేలాల్సి ఉందన్నారు. ఢిల్లీ ప్రభుత్వం విద్యను పేద పిల్లలకు ఉచితంగా అందించడమే నేర మనే ఉద్దేశ్యంతోనే అక్కడి సీఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో రిజర్వేషన్లను పొగబెట్టే పనిని బీజేపీ చేస్తుందని, కేంద్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, యూనివర్సిటీలను ప్రైవేట్ పరం చేస్తుందంటే రిజర్వేషన్లు రద్దు చేస్తున్నట్లే కదా అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు జయసారథి రెడ్డి, కాంగ్రెస్ నేత సంగిశెట్టి జగదీశ్, జనం సాక్షి ఎడిటర్ రహమాన్, ప్రొఫెసర్ ఖాసిం, జర్నలిస్టుల అధ్యయన వేదిక ఉపాధ్యక్షులు జంగిటి వెంకటేశ్, కోశాధికారి వేల్పుల సురేశ్, కార్యవర్గ సభ్యులు కంచె రాజు, పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

**టీఎన్జీవో నగర శాఖ అధ్యక్షుడు సల్వది శ్రీరాం**

సుల్తాన్‌బజార్, మే 7 : అధర్మం అప్పటి మటుకే రాజ్యమేలినా.. ధర్మమే చివరికి గెలుస్తుందనడానికి అక్రమ పద్ధతిలో నిర్వహించిన టీఎన్జీవో నగర శాఖ ఎన్నికలపై న్యాయస్థానం ఇచ్చిన తీర్పే నిదర్శనమని నగర శాఖ అధ్యక్షుడు సల్వది శ్రీరాం అన్నారు. మంగళవారం కమర్షియల్ ట్యాక్స్, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్, మత్స్య శాఖ తదితర డిపార్ట్‌మెంట్‌లలో ఒకటవ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఉత్తర్వుల కాపీలను ఆయా హెచ్‌వోడీలలోని టీఎన్జీవో యూనిట్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ కార్యదర్శి కందుకూరి విఠల్ బాబు, నాయకులు బి.కృష్ణ, బాలరాజు, వినోద్, మధు, గంగులు, కృష్ణ, పవన్, విశాల్, శ్రీకాంత్, శరత్, భరత్, రాము, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు